క్లుప్తంగా

కోటదుర్గమ్మకు మొక్కుల చెల్లింపు

పాలకొండ రూరల్: వర్షాలు అనుకూలిస్తున్న ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం లాభసాటిగా ఉండాలని ఆకాంక్షిస్తూ అన్నదాతలు కోటదుర్గమ్మకు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు.ఘటాలు, ముర్రాటలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో విశేష అర్చనలు చేపట్టారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

పాలకొండ: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ రత్నంరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. నగర పంచాయతీ అభివృద్ధికి సంబంధించి పనుల కేటాయింపు, సమస్యల పరిష్కారంపై సమావేశంలో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

రాయితీపై విత్తనాలు అందివ్వాలి

సీతానగరం: రాయితీపై విత్తనాలు అందివ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి మండలంలోని రైతులకు అవసరమైన విత్తనాలు దొరకడం లేదని, ఆర్‌జేఎల్, స్వర్ణమసూరి, సాంబమసూరి, 1121 రకం వరి విత్తనాలు మాత్రమే అరకొరగా లభిస్తున్నాయంటున్నారు. విత్తనాల కోసం వ్యవసాయాధికారులను ఆశ్రయిస్తే ఇండెంట్ పెట్టామని, ఐదు రోజుల్లో వస్తాయని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రైతులకు అవసరమైన, సరిపడ విత్తనాలు రాయితీపై ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



బూర్జలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని చినబోగిలి, బూర్జ, మరిపివలస గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ ఆదివారం చేపట్టారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున నీటి నిల్వలు, మురుగు ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్‌లు తెలిపారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

నేమ్‌బోర్డు ఏర్పాటు చేయండి

పార్వతీపురం రూరల్: మండలంలోని చినబొండపల్లి గ్రామస్తులు తమ ఊరి రెండు చివర్ల నేమ్‌బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఓ వైపు ఒడిశా ప్రాంతాల నుంచి.. మరోవైపు పార్వతీపురం నుంచి వచ్చే వారికి తమ ఊరి వద్ద నేమ్‌బోర్డు లేకపోవడంతో ఇది ఏ ఊరు అని అడిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, అలాగే తమ ఊరి గుర్తింపు కూడా లేదన్నారు.

తగ్గిన చెరకు సాగు



బుడ్డిపేటలో నాటేందుకు చెరకు మొక్క తరలిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలో చెరకు సాగు విస్తీర్ణం క్రమక్రమంగా తగ్గిపోతోంది. లచ్చయ్యపేటలోని ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవడం, రేగిడి మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలించడం వంటివి కష్టతరమైన నేపథ్యంలో రైతులు చెరకు సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. ఫలితంగా మండలంలో ఏటేటా చెరకు సాగు తగ్గుతూ వస్తోంది.

అంతర పంటలతో అదనపు ఆదాయం..

- మెలకువలు తప్పనిసరి
- రైతులను ప్రోత్సహిస్తున్నాం: ఏఓ





మిశ్రమ పంటలతో నిండుగా పంట భూములు (ఇన్‌సెట్లో) ఒకే సాగులో సన్‌ఫ్లవర్, కంది, వేరుశనగ పంటలు

భామిని:

గతంలో పాలకొండ డివిజన్ పరిధిలో గల మెట్టు భూముల్లో వేరుశనగతో పాటు కంది, జనప వంటి పంటలు సాగు చేస్తూ అంతరపంటగా పప్పు దినుసులు వేసేవారు. ఒకే సమయంలో రెండు పంటలు సాగు చేయడం వల్ల రైతుకు అదనపు ఆదాయం వచ్చేది. అయితే కొన్నేళ్లుగా ఆధునికత పేరుతో సమాజంలో మారుతున్న జీవన శైలి, జీవన ప్రమాణాలు,ఆహారపు అలవాట్లు మూలంగా మెట్ట భూముల్లో ఈ పంటల సాగు మందగించింది. ఫలితంగా ఎక్కువ మంది వర్షాధారం కింద కేవలం వేరుశనగనే ప్రధాన పంటగా సాగు చేస్తూ వస్తున్నారు. వర్షం సక్రమంగా పడితే వేరుశనగతో పాటు పశువులకు మేత కూడా లభిస్తుంది. వర్షం పడకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పశువులకు మేత దొరకని పరిస్థితి నెలకొంటుంది. ఈ పరిస్థితుల్లో అంతరపంటలు, ప్రకృతి సాగుపై వ్యవసాయాధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

అంతర పంటలతో..

రైతు కష్టాలు తీర్చడానికి ప్రకృతి సాగులో సుస్థిర వ్యవసాయ విధానంలో రైతుకు ఊరట కలిగిస్తున్నారు. నిరంతరం భూమి పచ్చని పంటలతో ఉండే విధానంలో నవధాన్యాలు పేరిట సాగు విధానంలో మార్పులు తీసుకువస్తున్నారు. ఇందుకు అనువుగా రైతుసేవా కేంద్రంలో నవధాన్యాల విత్తనాలు అందజేస్తున్నారు. నవధాన్యాల సాగు వల్ల భూసారి పెరిగి తర్వాత వేసిన పంటలతో అధిక ఆదాయం పొందుతున్నారు. అలాగే అంతర పంటల సాగును వ్యవసాయాధికారులు ప్రోత్సహిస్తున్నారు. ప్రధాన పంటలైన వేరుశనగ, కంది, జనప పంటల్లో అంతర పంటలుగా కూరగాయలు, జొన్న, సజ్జలు వంటి అంతర పంటలు వేసేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందులో ఒక పంట పోయినా మరో పంట రైతును ఆర్థికంగా ఆదుకుంటుంది.

రైతులను ప్రోత్సహిస్తున్నాం..



ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మిశ్రమ పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. పప్పు దినుసులతో పాటు కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వేరుశనగ, కంది, మొక్కజొన్న పంటల్లో కూరగాయలు, జొన్నలు, సజ్జలు సాగు చేస్తూ రైతు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాడు. **కొర్ను సింహచలం,మండల వ్యవసాయాధికారి, భామిని**

లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

పాలకొండ: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకూ పోరాటం తప్పదని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షురాలు ఎం. ఉమామహేశ్వరి అన్నారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ డీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, జి.జెస్సీబాయ్, ఎస్. హిమప్రభ, బి. అమరవేణి, ఎస్. గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భామినిలో భారీ వర్షం



బత్తిలిలో కురుస్తున్న భారీ వర్షం

భామిని: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రైతులకు ఊరటనిచ్చింది. పొలాలు, లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలలో నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్: సీతానగరం మండలం, భగ్గందొరవలస గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఇంటి పనుల విషయాల్లో అత్తాకోడళ్ల మధ్య తలెత్తిన విభేదంతో మనస్తాపం చెందిన కోడలు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి 'బాబూ'..

- మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ డిమాండ్

పార్వతీపురం టౌన్: తమ సమస్యలు పరిష్కరించా లని సీఎం చంద్రబాబును మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారు ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏడు రోజులుగా నిరసన చేస్తున్నారు. తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. టెక్నికల్, నాన్‌టెక్నికల్ సిబ్బందికి వేతనాలు రూ.29,200, రూ.24500 ఇవ్వాలన్నారు. 55 ఆదివారాలు, జాతీయ, రాష్ట్ర పండుగ దినాలు(72 రోజులు) సెలవులుగా ప్రకటించాలన్నారు. లేకపోతే ఆయా రోజుల్లో పనిచేసినందుకు గాను వేతనాలు లెక్కగట్టి ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన సిబ్బందికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అలాగే మృతుల కుటుంబాల్లోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వినతించారు. సీనియార్టీ ప్రాతిపదికన జీతాల చెల్లింపులు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఇవేవీ పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజులకు కృతజ్ఞతలు తెలుపుతున్న అనుబంధ విభాగాల అధ్యక్షులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని వైఎస్సార్ సీపీకి అంకిత భావంతో పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఇటీవల నియమితులైన మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు అన్నారు. ఈ మేరకు ఆదివారం మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజులను కలిసి తమ నియామకాలపై కృతజ్ఞతలు తెలిపారు. తమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వులతో మండలపార్టీ అనుబంధ అధ్యక్షుల హోదాను కట్టబెట్టినందుకు తామంతా పుష్పశ్రీవాణి పరీక్షత్‌రాజుల అండదండలతో పార్టీ విజయానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఆలయం ఎదుట తాత్కాలిక ఉపశమనం పనులు



ఆలయం ఎదుట చేస్తున్న పనులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల త్రినాథ స్వామి ఆయలం ఎదుట పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ ఆదివారం చేపట్టారు. ఈ మేరకు వరద నీరు ఆలయంలోకి చొరబడకుండా తాత్కాలిక ఉపశమనం పనులు చేయించారు. ఆలయం ఎదుట మురుగుపారే కాలువ లేకపోవడంతో పాటు రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డు ఎత్తు పెరగడంతో వర్షపునీరు నేరుగా ఆలయం లోపలికి ప్రవేశించింది. దీనిపై గ్రామస్తులు శనివారం తీవ్ర అభ్యంతరం తెలపడంతో ఆలయంలోకి నీరు ప్రవేశించకుండా తాత్కాలికంగా చర్యలు తీసుకున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో ఆలయం ఎదుట కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా పంచాయతీ అధికారులు పేర్కొన్నారు.

సంఘ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

పార్వతీపురంటౌన్: అన్నివిధాలా వెనకబడి ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘ బలోపేతమే లక్ష్యంగా మనమంతా పనిచేద్దామని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి. హనుమంతురావు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని బైపాస్ రోడ్డులోని ఆ సంఘ భవనంలో సంఘ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లవుతున్నా ప్రభుత్వాలు మనల్ని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప తమ సంక్షేమం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధుల పట్ల బాధ్యతగా మెలగాలి

- జిల్లా రెండవ అదనపు జడ్జి దామోదరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు

గరుగుబిల్లి: వృద్ధుల పట్ల బాధ్యతగా మెలగాలని వారు సమాజంలో ముఖ్య భాగమని తమ జీవిత అనుభవాల ద్వారా యవతరానికి మార్గనిర్దేశం చేసే అనుభవం కలిగిన వ్యక్తులని పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో వృద్ధుల ప్రాముఖ్యం, అనుభవం గుర్తించి వారిని గౌరవించాలని పిలుపునిచ్చారు. వారే ఈ సమాజానికి మార్గదర్శకులని, వారిని గౌరవించడం, సంరక్షించడం మన బాధ్యత అన్నారు. వృద్ధులు వారి హక్కులను తెలుసుకోవాలని సూచించారు. తగినంత ఆహారం, ఆశ్రయం, దుస్తులు, వైద్య సంరక్షణతో సహా మంచి జీవన ప్రమాణాలు పొందే హక్కు వారికి ఉందన్నారు. సామాజిక భద్రత, రక్షణ, వివక్ష నుంచి విముక్తి పొందే హక్కు ఉందని పేర్కొన్నారు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే హక్కును చట్టం వృద్ధులకు కల్పించిందని తెలియజేశారు. వృద్ధులను ఇంటిలో ఒంటరిగా వదిలేయకుండా వారితో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. వారికి వైద్యసదుపాయాలు అందించాలని హితవు పలికారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోస్పిన్, లోక్ అదాలత్ సభ్యుడు టి.జోగారావు, ప్రభుత్వ న్యాయవాది బి.సత్యనారాయణ, సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ తవిటినాయుడు, గరుగుబిల్లి ఎస్సై రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాను అనుసరిద్దాం..



రుషి యోగా కేంద్రంలో ఆసనాలు వేస్తున్న ఔత్సాహికులు

పాలకొండ రూరల్: యోగాను అనుసరిద్దాం... ఆరోగ్యాన్ని ఒడిసి పడదామని స్థానిక రుషియోగా కేంద్రం గురువు కె.జనార్దనరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక రుషి యోగా కేంద్రంలో ఔత్సాహికులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సూర్య నమస్కారాల వల్ల కలిగే మేలును వివరించారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. బీసీ, సుగర్ వంటి సమస్యలను కూడా యోగాతో అధిగమించ వచ్చన్నారు.

కుక్కల స్వైర విహారం



గొట్టివలసలో సంచరిస్తున్న కుక్కలు

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాటిని అదుపు చేసేందుకు అటు అధికారులు కానీ ఇటు ప్రజాప్రతినిధులు కానీ చొరవ చూపకపోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రేబిస్ వ్యాధి ప్రబలకుండా కుక్కలకు వ్యాధినిరోధక టీకాలు వేయాలని స్థానిక పశువైద్యాధికారులు పంచాయతీలకు సూచించారు. దీనికి పంచాయతీలు సహకరించకపోవడంతో కుక్కలు వీధుల్లో యథేచ్ఛగా తిరుగుతూ ప్రజలను ప్రాణాంతక వ్యాధులకు గురి చేస్తున్నాయి. కుక్కలకు సంతాన నిరోధక చికిత్సలు చేయించాలని పలుమార్లు అధికారులకు పలువురు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు చేపట్టకపోవడంతో కుక్కల సంతతి రోజురోజుకు పెరిగిపోతోంది. మండలంలోని గరుగుబిల్లి, గొట్టివలస, పెద్దూరు, రావుపల్లి, రావివలస తదితర గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యంతో దోబూచులాడకుండా గ్రామాల్లో కుక్కలను నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- కబడ్డీ అసోసియేషన్ మన్యం జిల్లా గౌరవాధ్యక్షుడు కొండలరావు



క్రీడాకారులతో పల్లా కొండలరావు, తదితరులు

పాలకొండ: కబడ్డీ కీడాకారులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కబడ్డీ అసోసియేషన్ మన్యం జిల్లా గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు అన్నారు. ఈ నెల 27 నుంచి హరిద్వార్‌లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఆదివారం నుంచి శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి నైపుణ్యం ఉండి జాతీయ స్థాయిలో పతకాలు పొందిన వారితో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. వారి వద్ద మెలకువలు తెలుసుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆయనతో పాటు అసోసియేషన్ సభ్యులు వెన్నపు చంద్రశేఖర్, కాయల రమేష్, గార లక్ష్మణరావు, తదితరులున్నారు. కాగా శిక్షణకు అయ్యే ఖర్చును కొండలరావు భరిస్తుండడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. డబ్బులు వెచ్చించడంపై క్రీడా కారులు అభినందనలు తెలిపారు.

కూటమి వెన్నుపోటుపై పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస రూరల్:

కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఆదివారం చినమేరంగిలోని తమ క్యాంపు కార్యాలయంలో 'కూటమి వెన్నుపోటు' పుస్తకావిష్కరణ చేశారు.

కార్యక్రమంలో కురుపాం, జియ్యమ్మవలస మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి పద్మావతి, ఇందిరా కుమారి, సుజాత, కోట రమేష్‌నాయుడు, లోలుగు నారాయణరావు, ఈశ్వరరావు, వెంకటనాయుడు, వైస్‌ఎంపీపీ సంపత్‌కుమార్, శంకర్రావు తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పట్టణ శివారుల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. రాజాం, వీరఘట్టం, సీతంపేటకు వెళ్లే మార్గాల్లో ఆదివారం డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్ చేసేవారు, మద్యం మత్తులో ఉన్నవారు, ధ్రువపత్రాలు లేనివారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు చైతన్యవంతులు కావాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

ఎక్కడి పనులు అక్కడే..

- బిల్లులు మంజూరు కావు – పనులు ముందుకు సాగవు
- అర్ధంతరంగా ఆగిన రహదారి పనులు
- రూ.30 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు



అర్ధంతరంగా ఆగిన ఎగువ ద్వారబందం రహదారి పనులు

సీతంపేట: అన్ని గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తాం.. భవనాలు, రహదారులు నిర్మిస్తాం.. రోడ్డు లేని గ్రామాలంటూ లేకుండా చర్యలు తీసుకుంటామన్న కూటమి నాయకుల హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. రహదారి నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పనులు చేసిన కొన్ని రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు సైతం కొట్టుకుపోవడం గమనార్హం. చేసిన పనులకు బిల్లులు మంజూరు కానిదే ముందుకు వెళ్లలేమని సంబంధిత కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో సీతంపేట, మందస, పాతపట్నం ఇంజినీరింగ్ సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 255 పనులకు గాను 165 పనులు పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. సుమారు రూ.32 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. సీసీ రహదారులు, భవనాలు, కల్వర్టులు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు జరిగాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్, పంచాయతీరాజ్, తదితర శాఖల ద్వారా చేపట్టిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో మెటీరియల్ కాంపోనెంట్ కింద 40 శాతం.. వేతనదారులకు 60 శాతం బిల్లులు చెల్లించాలి. డిసెంబర్‌లో కొన్ని బిల్లులు చెల్లించగా, ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి బిల్లుల చెల్లింపులు జరగలేదు. ఈ విషయమై ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ కుమార్ వద్ద ప్రస్తావించగా బిల్లులు అప్‌లోడ్ చేయడం జరిగిందని, త్వరలో బిల్లులు చెల్లింపులు జరుగుతాయని చెఅప్పరు.



తలైబుగూడలో నిలిచిన కమ్యూనిటీ భవనం



గొయిదిలో నిలిచిన సచివాలయ భవనం పనులు